చలివేంద్రాల పేరుతో దోపిడీ

- నగరంలో 34 ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు
- గత నెలలో వర్షాలు పడటంతో అర్ధాంతరంగా నిలిచిపోయిన సేవలు
- ఎండలు మండుతున్న వాడుకలోకి తేని కాంట్రాక్టర్లు

నెహ్రూనగర్: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు కార్పొరేషన్ చలివేంద్రాలు ఏర్పాటు చేసింది. అదే విధంగా హీట్ వేవ్స్‌ను తప్పించుకునేందుకు పలు ప్రధాన జంక్షన్స్ వద్ద గ్రీన్ మ్యాట్‌తో షెల్టర్స్ ఏర్పాటు చేశారు. అయితే ఏర్పాటు చేసిన కొద్ది రోజులకే వర్షాలు పడటంతో పాటు గ్రీన్ మ్యాట్ పూర్తిగా చినిగిపోయింది. జూన్ మొదటి వారంలో ఎండల తీవ్రత అధికంగా ఉన్నా కాంట్రాక్టర్లు వాటిని వాడుకలోకి తీసుకురాలేదు.

తాటిఆకు పందిరికి రూ.25 వేలు పైగా ఖర్చు..

నగరంలో 34 ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇవి ఏర్పాటు చేసిన కొద్ది రోజులకే అంటే మే నెలలో వర్షాలు పడకపోవడంతో చలివేంద్రాలు సక్రమంగా రన్ అవ్వలేదనే చెప్పుకోవాలి. వీటి నిర్వహణ కోసం రూ.12.47లక్షలు ఖర్చు చేశారు. ఇందులో ఒక్కో చలివేంద్రానికి చిన్న తాటాకు పందిరి, ఒక బల్ల, రెండు కుండలు ఏర్పాటు చేసినందుకు రూ.25 వేల నుంచి 30 వేలకు దాకా ఖర్చు అవుతున్నట్లు అంచనాలతో టెండర్ పిలిచారు. కాంట్రాక్టర్లు కూడా ఇదే అదునుగా నగరంలో 34 ప్రాంతాల్లో తూతూ మంత్రంగా ఏర్పాటు చేశారు.

చలివేంద్రాలు ఏర్పాటు చేసిన ప్రాంతాలివే...

- ఏఈ 1, 3 పరిధిలోనిగుజ్జనగుండ్ల సెంటర్, స్తంభాలగరువు వాటర్ ట్యాంకుల వద్ద, అరండల్‌పేట 1వ లైను, చిల్లీస్ సెంటర్‌లో చలివేంద్రాల కోసం రూ.1.15లక్షలు.
- ఏఈ 2 పరిధిలో ఎన్టీఆర్ స్టేడియం దగ్గర, లాడ్జిసెంటర్, బ్రాడీపేట 5వ లైన్, కొరిటెపాడు పార్కు వద్ద, పట్టాభిపురం శానిటరీ ఆఫీస్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాలకు రూ.1.40 లక్షలు
- ఏఈ 4 పరిధిలో ఎన్‌జీఓ కాలనీ, మిర్చియార్డ్(ఎన్ఆర్‌టీ రోడ్డు), మిర్చియార్డ్(సీపీటీ రోడ్డు), హౌసింగ్ బోర్డ్ కాలనీ ఆర్చ్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాలకు రూ.1.68 లక్షలు
- ఏఈ 5 పరిధిలో నల్లచెరువు మూడు బొమ్మల సెంటర్, చుట్టుగుంట సెంటర్, జీటీ రోడ్ మెడికల్ క్లబ్ దగ్గర, కలెక్టర్ ఆఫీస్ ఈసేవ ఆఫీస్ ఎదురు, టీబీ బంగ్లా, పల్నాడు బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాలకు రూ.1.47 లక్షలు.
- ఏఈ 10 పరిధిలో మణిపురం ఫ్లైఓవర్ దగ్గర, కొత్తపేట శివాలయం, గాంధీ పార్కు మెయిన్ గేట్, జీజీహెచ్, నాజ్ సెంటర్ ఆంజనేయస్వామి గుడి వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాలకు రూ.1.41 లక్షలు.
- ఏఈ 11 పరిధిలో ఏటుకూరు రోడ్డు, జీటీ రోడ్డు టైటానిక్ ఎదురు, పొన్నూరు రోడ్డులో ఏర్పాటు చేసిన చలివేంద్రాలకు రూ.1.50 లక్షలు.
- ఏఈ 12 పరిధిలో పాతగుంటూరు మణిహోటల్ సెంటర్, ఆర్టీసీ బస్టాండ్, కొల్లి శారాదా మార్కెట్, పాతగుంటూరు అంకమ్మతల్లి గుడి దగ్గర ఏర్పాటు చేసిన చలివేంద్రాల్లో రూ.2.81 లక్షలు.
- ఏఈ 14 పరిధిలో వసంతరాయపురం, సంజీవయ్యనగర్, నెహ్రూనగర్ 6వ లైను వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాలకు 1.05లక్షలు. మొత్తం కలిపి 12.47లక్షలు ఖర్చు చేశారు.



గుంటూరు నగరంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం

షెల్టర్‌కు రూ.4 లక్షలు బిల్లు

నగరంలో హీట్ వేవ్స్ నుంచి నగర ప్రజల తప్పించేందుకు ఆర్టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్, నాజ్‌సెంటర్, హిందూ కాలేజీ, ఎన్టీఆర్ స్టేడియం, గుజ్జనగుండ్ల, చుట్టుగుంట సర్కిల్, మిర్చియార్డు(ఎన్ఆర్‌టీ వైపు) వద్ద గ్రీన్ మ్యాట్‌తో షెల్టర్ వేయాలని ప్రతిపాదనలు ఉన్నాయి. అయితే మే నెలలో వర్షాలు పడటంతో ఒక్క ఎన్టీఆర్ స్టేడియం వద్ద మాత్రమే గ్రీన్ మ్యాట్‌తో షెల్టర్ వేశారు. అది కూడా కొద్ది రోజులకు పూర్తిగా ఊడిపోయింది. ప్రస్తుతం గ్రీన్ మ్యాట్ అసలు లేనే లేదు. దీని కోసం రూ.4 లక్షలు బిల్లు పెట్టేందుకు ప్రతిపాదనలు పెట్టారు.


ఎన్టీఆర్ స్టేడియం వద్ద గ్రీన్ మ్యాట్ ఖాళీగా దర్శనమిస్తున్న షెల్టర్

చలివేంద్రాలు నిర్వహించిన రోజులకు మాత్రమే బిల్లు

వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు నగరపాలక సంస్థ తరుపున చలివేంద్రాలు ఏర్పాటు చేశాం. మే నెలలో వర్షాలు పడటంతో కొన్ని రోజుల పాటు అవి వాడుకలోకి రాలేదు. చలివేంద్రాలు నిర్వహించిన రోజులకు మాత్రమే బిల్లు ప్రాసెస్ చేస్తాం.

– నాగమల్లేశ్వరరావు, ఎస్ఈ, నగరపాలక సంస్థ

నేడు గాంధీ పార్కులో మెగా యోగా కార్యక్రమం

నెహ్రూనగర్: అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని సోమవారం గాంధీ పార్క్‌లో నిర్వహించనున్న మెగా యోగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నగర పాలక సంస్థ డెప్యూటీ కమిషనర్లు కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన యోగాంధ్ర 2025లో భాగంగా గుంటూరు నగర పాలక సంస్థ పరిధిలోని గాంధీ పార్క్‌లో ఈ నెల 16వ తేదీ ఉదయం 6 గంటలకు మెగా యోగా కార్యక్రమ ఏర్పాట్లను నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశాల మేరకు డెప్యూటీ కమిషనర్లు, ఇంజనీరింగ్ అధికారులు కలిసి సంయుక్తంగా పరిశీలించారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మే 21 నుంచి జూన్ 21 వరకు ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన యోగాంధ్ర 2025లో గుంటూరు నగర ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా వార్డు సచివాలయ కార్యదర్శుల ద్వారా అవగాహన కలిగించడానికి ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. యోగా పట్ల ప్రజల్లో మరింతగా అవగాహన కలిగించడం కోసం 16న గాంధీ పార్క్ లో ఉదయం 6 గంటలకు జరిగే యోగా కార్యక్రమంలో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్లు పాల్గొంటారన్నారు. నగరంలోని విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, యోగా శిక్షకులు, అభ్యాసకులు, సీనియర్ సిటిజన్లు, స్టేక్ హోల్డర్స్ ఈ కార్యక్రమానికి హాజరగుతారన్నారు. యోగా జరిగే ప్రాంతంలో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, ఇంజినీరింగ్ అధికారులు అవసరమైన మైక్ సిస్టం, గ్రీన్ మ్యాట్, తాగునీరు వంటి సదుపాయలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సి.హెచ్.శ్రీనివాసరావు, టి.వెంకటకృష్ణయ్య, ఈఈ సుందర్రామిరెడ్డి, డీఈఈ హనీఫ్ పాల్గొన్నారు.


గాంధీ పార్కులో ఏర్పాట్లను పరిశీలిస్తున్న డెప్యూటీ కమిషనర్లు

అవోపా సేవలు విస్తృతం చేసేందుకు కృషి

గుంటూరు ఎడ్యుకేషన్: ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) ఆధ్వర్యంలో విద్య, వైద్య, ఉపాధి రంగాల్లో సేవలు అందిస్తున్నట్లు అవోపా రాష్ట్ర అధ్యక్షుడు తటవర్తి రాంబాబు పేర్కొన్నారు. అరండల్‌పేటలోని అవోపా కార్యాలయంలో ఆదివారం 108 మంది పేదలకు పెన్షన్ పంపిణీ చేశారు. ఈసందర్భంగా అవోపా గుంటూరుశాఖ అధ్యక్షుడు కేవీ బ్రహ్మం అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు తటవర్తి రాంబాబు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అవోపా శాఖల ద్వారా విద్య, వైద్యం, ఉపాధి అంశాల్లో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర స్థాయిలో అవోపా శాఖలు బలంగా ఉన్నాయని, ఎక్కడ ఎటువంటి అవసనం వచ్చినా వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేయడంతో పాటు పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు ఉచిత శిక్షణ, వసతి కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. డాక్టర్ వేమూరి నాగశంకర్ మాట్లాడుతూ అవోపా ఆధ్వర్యంలో ప్రతినెలా 108 మంది పేదలకు రూ.500 చొప్పున పెన్షన్ పంపిణీతో పాటు విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేయడం అభినందనీయమని చెప్పారు. చార్టర్డ్ అకౌంటెంట్ పులికొండ పిచ్చయ్య మాట్లాడుతూ అవోపా ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి పేదలకు మందులు పంపిణీ, గో సేవ కార్యక్రమాల నిర్వహణ అభినందనీయమని, అవోపా ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాలకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో అవోపా కోశాధికారి మహంకాళి శ్రీనివాసరావు, పెన్షన్ కన్వీనర్ వెంకట్రావు, స్వామి గుప్తా, మిరియాల మోహన్ రావు, అమరా రమేష్, టీవీ రమణ పాల్గొన్నారు.


పేదలకు పెన్షన్ అందజేస్తున్న రాంబాబు, డాక్టర్ నాగ శంకర్, పిచ్చయ్య తదితరులు

క్లుప్తంగా

నేడు డయల్ యువర్ కమిషనర్, పీజీఆర్ఎస్

నెహ్రూ నగర్: డయల్ యువర్ కమిషనర్ (0863–2224202) కార్యక్రమం సోమవారం నిర్వహించనున్నట్లు నగర పాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కమిషనర్ చాంబర్‌లో ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం కౌన్సిల్ సమావేశ మందిరంలో మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి నేరుగా అర్జీలు, ఫిర్యాదులు తీసుకుంటామని నగర కమిషనర్ ఆ ప్రకటనలో తెలిపారు.

వృద్ధులు, దివ్యాంగులకు బియ్యం పంపిణీ



నగరంపాలెం: ప్రతి ఒక్కరూ వయో వృద్ధులు, దివ్యాంగులను ఆదుకోవాలని గిరిధారి మిత్రమండలి అధ్యక్షులు బవిరిశెట్టి శ్రీనివాసరావు అన్నారు. కొత్తపేట సోమువారివీధిలోని మండలి కార్యాలయంలో ఆదివారం వృద్ధులకు బియ్యం, నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ ఉండి కూడా అనేక మంది వృద్ధులు ఒంటరిగా జీవిస్తున్నారని అన్నారు. అటువంటి వారికి తమ వంతుగా సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి పలకలూరి శివరావు, కోశాధికారి దిండు రాజశేఖర్, సభ్యులు జుజ్జూరు శివకుమార్, పబ్బిశెట్టి సంజీవరావు, గార్లపాటి రోశయ్య, పీఎస్ఆర్ గుప్తా, సింగంశెట్టి ఆంజనేయులు పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై ఆదివారం సినీ సంగీత విభావరి నిర్వహించారు. కళాంజలి ఆధ్వర్యంలో జరగ్గా, ఆలయ కమిటీ అధ్యక్షులు సి.హెచ్.మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. గాయని, గాయకులు బాలకామేశ్వరరావు, సత్యవర్ధన్, షేక్ రసూల్ బాబు, ఆర్.సాంబశివరావు, పి.గాయత్రి అలనాటి చిత్రాల్లోని మధుర గీతాలను ఆలపించారు. ప్రేక్షకులను అలరించాయి. సంస్థ వ్యవస్థాపకులు తొట్టెంపూడి రమేష్ పాల్గొనగా, కళాకారులను, అతిథులను సత్కరించారు.

రూ.90 వేలు విలువైన వస్తువులు చోరీ

లక్ష్మీపురం: ఇంటి వెనుక భాగంలో ఉన్న మెష్ తలుపు బోల్ట్‌లు విప్పతీసి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో గదిలో ఉన్న రూ.90 వేలు విలువ చేసే వస్తువులు చోరీ చేసిన ఘటనపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు ఆదివారం రాత్రి కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. చైతన్యపురీ కాలనీకి చెందిన బొర్రా సుబ్బారావు ఇండియన్ ఆర్మీలో జవాన్‌గా పని చేస్తుంటాడు. భార్య బొర్రా గంగాదేవి ఇంటి వద్దనే ఉంటుంది. అయితే ఈనెల 13వ తేదీ రాత్రి నిద్రిస్తున్న సమయంలో ఇంటి వంట గది వెనుక భాగంలో ఉన్న మెష్ తలుపు బోల్ట్‌లు విప్పతీసి గుర్తు తెలియని వ్యక్తి ఇంట్లో చొరబడి రెండు సెల్ ఫోన్లు, ల్యాప్‌టాప్, ఇయర్ బడ్స్‌ను చోరీ చేసి పరారయ్యాడు. ఉదయానే నిద్ర లేచి చూసే సరికి ఇంట్లో చోరీ జరిగినట్లు గుర్తించారు. ఈ విషయాన్ని భర్త సుబ్బారావుకు తెలియజేయడంతో ఉద్యోగ బాధ్యతలు పూర్తి చేసుకుని ఆదివారం అరండల్‌పేట పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అత్తా, కోడలుపై కర్రలతో దాడి

లక్ష్మీపురం: మద్యం మత్తులో అసభ్యంగా ప్రవర్తించడంతో పాటు నిలదీసిన అత్తా కోడలుపై దాడి నిందితులపై ఆదివారం కేసు నమోదు చేశారు. నగరంపాలెం పోలీసులు తెలిపిన వివరాలు.. లాలుపురం రోడ్డు శశాంక్ గోయల్ కాలనీ 6వ లైన్‌కు చెందిన మారేళ్ల స్వాతి, భర్త శ్రీధర్ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటారు. వారి వద్ద స్వాతి అత్త రాజేశ్వరి కూడా ఉంటుంది. అయితే శనివారం అర్ధరాత్రి అదే ప్రాంతానికి చెందిన ప్రతాప్, గోపి, మణీ, షబ్బీర్‌లతో పాటు మరి కొంత మంది మద్యం తాగి అసభ్య పదజాలంతో స్వాతి ఇంటి ముందు గట్టి గట్టిగా కేకలు వేసుకుంటున్నారు. మహిళలు ఉన్నారని కూడా లేకుండా అసభ్యకరంగా మాట్లాడుతున్నారని స్వాతి అడిగినందుకు మద్యం మత్తులో ఉన్న వారందరూ కర్రలతో స్వాతి, అత్త రాజేశ్వరిలపై దాడి చేసి గాయాలు పాలు చేశారు. స్థానికులు గమనించి వారిని జీజీహెచ్‌కు తరలించగా చికిత్స అనంతరం ఆదివారం రాత్రి నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆన్‌లైన్‌లో పేరు ఎక్కిస్తానని మోసం..

పారిశుద్ధ్య కార్మికుడి ఆరోపణ

నెహ్రూనగర్: కరోనా సమయంలో గుంటూరు నగర పాలక సంస్థ పరిధిలో పారిశుద్ధ్య కార్మికుడిగా విధులు నిర్వహించిన తన పేరును ఆన్‌లైన్‌లో పేరు ఎక్కించి పర్మినెంట్ చేస్తానని చెప్పి కాంట్రాక్టర్ వరికల్లు రవి మోసం చేసి రూ.90 వేలు తీసుకున్నాడని.. ఆన్‌లైన్‌లో పేరు ఎక్కించకపోగా ఉద్యోగం కూడా పోయిందని కుంచాల రవి ఆరోపించారు. ఆదివారం అంబేడ్కర్ భవన్ సెంటర్ వద్ద నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆవేదన వ్యక్తం చేశారు. మాట్లాడుతూ 2020 డిసెంబర్, 26న కరోన సమయంలో నగరపాలక సంస్థ పరిధిలో వర్కర్‌గా కాంట్రాక్టర్ వరికల్లు రవి కింద వర్కర్‌గా చేరానాని చెప్పాడు. 2021 జనవరి, ఫిబ్రవరి, మార్చి, అక్టోబర్, నవంబర్ నెలకు మాత్రమే జీతాలు ఇచ్చారని.. మిగిలిన నెలకు జీతాలు ఇవ్వమని అడిగితే జీఎంసీ నుంచి రాగానే ఇస్తానని చెప్పాడన్నారు. ఈ క్రమంలో మీ పేరు పర్మినెంట్(ఆప్కాస్) కింద ఆన్‌లైన్‌లో పేరు ఎక్కిస్తానని చెప్పి రూ.లక్ష ఇవ్వమంటే నేను రూ.90 వేలు సమరించుకున్నానని వివరించాడు. 2022లో అప్పటి కమిషనర్ కీర్తి చేకూరి కాంట్రాక్టర్ కింద కాకుండా నేరుగా బ్యాంక్ ద్వారానే జీతాలు జమ చేసే విధంగా చర్యలు తీసుకోవడంతో 2022 జూన్ వరకు నగరపాలక సంస్థ నుంచి నేరుగా తన బ్యాంక్ ఖాతాకు నెలవారీ జీతం పడిందని.. ఆ తరువాత కోవిడ్ తగ్గుముఖం పట్టడంతో మమ్మల్ని తీసేశారని చెప్పాడు. అప్పటి నుంచి తీసుకున్న రూ.90 వేలు తిరిగి ఇవ్వాలని, పెండింగ్ జీతాలు ఇవ్వాలని కోరినా ఎటువంటి ఫలితం లేదన్నారు. కూలి పనులు చేసుకునే తాను ఇంట్లో బంగారు నగలు తాకట్టు పెట్టి, మరి కొంత బయట వడ్డీ తీసుకుని రూ.90 వేలు చెల్లించానని ఉన్నతాధికారులు స్పందించి వాటిన్నంటిని తిరిగి తనకు ఇప్పించాలని కోరాడు.

పాఠశాల అభివృద్ధికి తుదిశ్వాస వరకు కృషి



సత్కారం అందుకున్న గురువులతో పలువురు ప్రజాప్రతినిధులు

పూర్వ విద్యార్థులైన ప్రజా ప్రతినిధులకు సత్కారం

నగరంపాలెం: విద్య నేర్పి, విద్యార్థుల పురోభివృద్ధికి తోడ్పడిన పాఠశాలలకు జీవితాంతం రుణపడి ఉండాలని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. బృందావన్‌గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి దేవస్థాన కల్యాణ మండపంలో శ్రీపాటిబండ్ల సీతారామయ్య ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులైన ప్రజా ప్రతినిధుల సన్మానం ఆదివారం నిర్వహించారు. పూర్వ విద్యార్థి మోదుగుల వాసుదేవరెడ్డి అధ్యక్షత వహించి మాట్లాడారు. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ అత్యుత్తమ విద్యను అందించారని కొనియాడారు. విద్యార్థుల అభివృద్ధికి సోపానంగా నిలిచిన పాఠశాలల పురోభివృద్ధికి పూర్వ విద్యార్థులు సహకరించాలని కోరారు. పూర్వ విద్యార్థిగా తనకు విద్యను బోధించిన సీతారామయ్య ఉన్నత పాఠశాల అభివృద్ధికి తుది శ్వాస వరకు కృషి చేస్తానని చెప్పారు. మైలవరం ఎమ్మెల్యే వసంతకృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ ఆనాటి నుంచి ఈనాటి వరకు ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా సీతారామయ్య ఉన్నత పాఠశాల విద్యారంగంలో ముందంజలో ఉందని అన్నారు. వినయ విధేయతలు, నాయకత్వ పటిమ, కష్టించే తత్వం పాఠశాల నుంచి లభించిన వరాలని పేర్కొన్నారు. నగర మేయర్ కోవెలమూడి నాని మాట్లాడుతూ తన ఉన్నతికి, సమాజంలో గౌరవప్రదమైన స్థానానికి ఈ పాఠశాలే కారణమని అన్నారు. స్కూలు అభివృద్దే పూర్వ విద్యార్థిగా తన ధ్యేయమని చెప్పారు. పూర్వ విద్యార్థులైన రాజకీయ నేత తాళ్ల వెంకటేష్ యాదవ్, ఏసీపీ గుంటుపల్లి శ్రీనివాస్, ఆచార్య ద్వారక సుశీల ప్రసంగించారు. అనంతరం ఎమ్మెల్యేలు జూలకంటి బ్రాహ్మారెడ్డి, వసంతకృష్ణప్రసాద్, మేయర్ కోవెలమూడి రవీంద్రను పూర్వ విద్యార్థి సంఘ నాయకులు గోగినేని విజయ్‌కుమార్, మోదుగుల వాసుదేవరెడ్డి, జవహర్‌లు సత్కరించి, జ్ఞాపికలు అందించారు. గురువులను సత్కరించారు. తొలుత నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మున్సిపల్ ఈఈ నాగమల్లేశ్వరరావు, ఆర్‌వీఆర్ మాజీ ప్రిన్సిపాల్ కోట శ్రీనివాస్, డాక్టర్ యశోద, శాంతిశ్రీ, అనంత శేఖర్, గట్టినేని వెంకటేశ్వరరావు, మండలి శ్రీనివాస్, గుమ్మడి సీతారామయ్య చౌదరి, పెద్ది శ్రీనివాస్, దివాకర్, కొమ్మినేని కోటేశ్వర రావు, బంగారు బాబు పాల్గొన్నారు.

ఓ వ్యక్తిపై కత్తితో దాడి

లక్ష్మీపురం: ఓ వ్యక్తి తనకు డబ్బు ఇవ్వాలని ఊరంతా చెబుతావా అంటూ దారి అడ్డగించి కత్తితో దాడి చేసిన గాయాలు పాలు చేసిన ఘటన శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. నగరంపాలెం పోలీసులు తెలిపిన వివరాలు.. కొత్తపేట ప్రాంతానికి చెందిన షేక్ సమీర్ అనే వ్యక్తి తోపుడు బండ్లకు చార్జింగ్ లైట్లు అద్దెకు ఇస్తు జీవనం సాగిస్తుంటాడు. అయితే నల్లచెరువు ప్రాంతానికి చెందిన ఇస్మాయిల్ అనే వ్యక్తికి కూడా లైట్లు అద్దెకు ఇవ్వడంతో పాటు ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయని చెప్పడంతో సమీర్ క్రెడిట్ కార్డు ద్వారా రూ.50 వేలు ఇస్మాయిల్‌కు అప్పుగా ఇస్తాడు. డబ్బులు తీసుకున్నప్పటి నుంచి ఇస్మాయిల్ ఎలాంటి సమాధానం చెప్పడం కాని తిరిగి ఇవ్వక పోవడంతో నల్లచెరువు, చుట్టుగుంట పరిసర ప్రాంతాలలో ఉన్న వారితో ఇస్మాయిల్ వద్ద క్రెడిట్ కార్డు ద్వారా తీసుకున్న అప్పును ఇప్పించాల్సిందిగా చెప్పాడు. ఈ విషయం తెలుసుకున్న ఇస్మాయిల్ శనివారం అర్ధరాత్రి చుట్టుగుంట బాషా హోటల్ వద్ద అద్దెకు ఇచ్చిన లైట్లు వాపసు తీసుకుంటున్న నేపథ్యంలో సమీర్‌ను ఇస్మాయిల్ అడ్డగించాడు. తన గురించి ఊరంతా చెబుతావా అంటు పక్కనే ఉన్న అరిటికాయాల బండిపై ఉన్న కత్తితో దాడి చేసి గాయాలపాలు చేశాడు. దీంతో స్థానికులు హుటా హుటిన జీజీహెచ్‌కు తరలించగా చికిత్స అనంతరం సమీర్ నగరపాలెం పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రాత్రి ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సకాలంలో వైద్యంతో బ్రెయిన్ స్ట్రోక్ నుంచి ఉపశమనం



లక్ష్మీపురం: సకాలంలో వైద్యంతో బ్రెయిన్ స్ట్రోక్ నుంచి ఉపశమనం ఉంటుందని ప్రముఖ న్యూరో రేడియాలజిస్ట్ డాక్టర్ లంకా వివేక్ అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో ఆరోగ్య సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అల్జీమర్స్ సమస్యకు గురైన వారిలో ముందుగా ఆ రోజు లేదా గత కొన్ని రోజులకు సంబంధించిన విషయాలు మర్చిపోవడం, రెండో దశలో కొన్ని సంవత్సరాల క్రితం విషయాలు మరిచిపోవడం, మూడో దశలో చాలా సంవత్సరాల క్రితం విషయాలు మరిచిపోవడం జరుగుతుందని చెప్పారు. మెదడు నరాలలో షార్ట్ సర్క్యూట్ అవ్వడం వలన ఫిట్స్ సమస్య ఉత్పన్నమవుతుందని, ఇది ఎక్కువగా చిన్న వయస్సులో 40 సంవత్సరాల లోపు వారికి వస్తుందని వివరించారు. అనంతరం అవగాహన సభ్యులు డాక్టర్ లంకా వివేక్‌ను ఘనంగా సత్కరించారు. ఈ ఆరోగ్య సభకు టీవీ సాయిరాం కోఆర్డినేటర్‌గా వ్యవహరించగా.. జేకేసీ కాలేజ్ విశ్రాంత అధ్యాపకులు ఆర్.రామచంద్రరావు, డాక్టర్ రవికుమార్, జనవిజ్ఞాన వేదిక చలామారెడ్డి పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో కిమ్స్ శిఖర హాస్పిటల్ ఆర్గనైజర్స్ కుమార్ నూరుల్ మహమ్మద్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

సీపీఐ జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్



లక్ష్మీపురం: ప్రజల అభ్యున్నతికి అనునిత్యం కృషి చేయడం, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే సీపీఐ అజెండా అని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం భారత కమ్యూనిస్టు పార్టీ అశోక్ నగర్ శాఖ 13వ మహాసభ అశోక్ నగర్ ప్రాంతంలో ఘనంగా నిర్వహించారు. మహాసభకు ఆకిటి అనిల్ కుమార్ అధ్యక్షత వహించారు. తొలుత నగర కార్యదర్శి కోట మాలాద్రి పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అజయ్‌కుమార్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో శాఖ కార్యదర్శి రామచంద్రుడు, నగర కమిటీ సభ్యులు ఆకిటి అరుణ్ కుమార్, రావుల అంజిబాబు, మంగ శ్రీనివాసు పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక, మానసిక దృఢత్వం


శిక్షణ పొందిన క్రీడాకారులతో కేవీ బ్రహ్మం, కామేశ్వరశాస్త్రి, శివాజీ, సుధీర్‌కుమార్

గుంటూరు ఎడ్యుకేషన్: క్రీడలతో శారీరక, మానసిక దృఢత్వం చేకూరుతుందని టీజేపీఎస్ కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం పేర్కొన్నారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో వేసవి శిక్షణ శిబిర ముగింపు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా బహుమతి ప్రదానోత్సవ సభలో కేవీ బ్రహ్మం మాట్లాడుతూ విద్యార్థులు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవడంతో పాటు తమలోని క్రీడా నైపుణ్యాలకు పదును పెట్టుకునే విధంగా వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. విద్యార్థి దశలోనే నైపుణ్యాలకు మరింతగా పదును పెట్టి, ప్రతిభావంతులుగా ఎదగాలని సూచించారు. క్రీడల్లో పొందిన శిక్షణను సద్వినియోగం చేసుకుని ఇష్టమైన క్రీడాంశాల్లో నిగమ్నం కావడంలో విద్యార్థుల కృషి చేయాలని సూచించారు. శారీరకంగా, మానసికంగా దృఢంగా, శక్తివంతంగా ఎదిగి, భావి క్రాడాకారులుగా రాణించాలని ఆకాంక్షించారు. ఇష్టమైన రంగాన్ని ఎంపిక చేసుకుంటే త్వరగా జీవితంలో స్థిరపడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీహెచ్ కామేశ్వరశాస్త్రి మాట్లాడుతూ క్రీడల్లో పాల్గొనడం ద్వారా నాయకత్వ లక్షణాలు ఏర్పడతాయని, క్రీడలకు టీజేపీఎస్ కళాశాల పెద్దపీట వేస్తుందని తెలిపారు. అనంతరం శిక్షణ పొందిన క్రీడాకారులకు ప్రశంసా పత్రాలు, టీషర్ట్స్ అందజేశారు. కార్యక్రమంలో వేసవి క్రీడా శిక్షణ సమన్వయకర్త ఆర్.శివాజీ, కో–కన్వీనర్ డాక్టర్ జేవీ సుధీర్ కుమార్, క్రీడాకారుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

శ్రీవిద్యా సరస్వతి అమ్మవారికి విశేషాభిషేకాలు

నగరంపాలెం: స్థానిక మల్లారెడ్డినగర్ శ్రీవిఘ్నేశ్వరస్వామి సహిత శ్రీధర్మశాస్త అయ్యప్పస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా పూజలు ఆదివారం కొనసాగాయి. ఉదయం గోపూజ, గురుప్రార్థన, మండపారాధన, వేదమంత్రాల నడుమ నిర్వహించారు. శ్రీవిద్యాసరస్వతీ అమ్మవారికి, సుబ్రహ్మణ్యస్వామికి విశేషాభిషేకార్చనలు నిర్వహించి, ప్రత్యేక పూజలు చేపట్టారు. సాయంత్రం శ్రీసూక్త హోమం, సుబ్రహ్మణ్య హోమం భక్తిశ్రద్ధలతో జరగ్గా, అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు. ఏంకేఆర్ అయ్యప్పస్వామి ఫౌండేషన్ చైర్మన్ మెట్టు కృష్ణారెడ్డి దంపతులు పాల్గొన్నారు.


ప్రత్యేక అలంకరణలో శ్రీవిద్యా సరస్వతి అమ్మవారు


హోమం నిర్వహిస్తున్న అర్చకులు

'కన్నప్ప'లో సన్నివేశాలు తొలగించాలని నివేదికపై హర్షం

నగరంపాలెం: కన్నప్ప చిత్రంలో పదమూడు సన్నివేశాలు తొలగించాలని ప్రాంతీయ కమిటీ నివేదిక ఇవ్వడంపై బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సిరిపురపు శ్రీధర్‌శర్మ ఆదివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. తొలగించిన సన్నివేశాల చిత్రం కాపీ వచ్చాకే సెన్సార్ సర్టిఫికెట్ జారీ చేస్తామని ప్రాంతీయ అధికారి ప్రతిపాదించినట్లు ఆయన పేర్కొన్నారు. సనాతన ధర్మం, సంప్రదాయాలను కించపరచడం, దేవి దేవతలను, పిలక గిలక పాత్రలతో బ్రాహ్మణ సామాజిక వర్గాన్ని, కోయ కులాన్ని కించపరిచే పదమూడు సన్నివేశాలు తొలగించాలని 11 మంది రివిజన్ కమిటీ నివేదిక ఇచ్చారని తెలిపారు. కన్నప్ప చిత్రంలోని కొన్ని సన్నివేశాలు తొలగించాలంటూ ఇటీవల ఏపీ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసినట్లు గుర్తుచేశారు. ఈ క్రమంలో సనాతన ధర్మ పరిరక్షణ జేఏసీ, బ్రాహ్మణ చైతన్య వేదిక, ఏపీ అర్చక సేవా సంఘం, హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి సంయుక్తంగా ఆందోళనలు, నిరసన ప్రదర్శనలు నిర్వర్తించినట్లు ఆయన తెలిపారు.

వికసిత భారత్ సంకల్ప సభ


మాట్లాడుతున్న తిరుపతిరావు

గుంటూరు మెడికల్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 11 సంవత్సరాలు సుపరిపాలన పూర్తి చేసుకున్న సందర్భంగా గుంటూరు తూర్పు నియోజకవర్గం పట్నంబజారు పూలకొట్టు సెంటర్‌లో ఐదో మండలం అధ్యక్షుడు మల్లాల లక్ష్మణ్ గౌడ్ ఆధ్వర్యంలో వికసిత భారత్ సంకల్ప సభ జరిగింది. సభలో 70 సంవత్సరాలు పైబడిన వారికి ఆయుష్మాన్ భారత్ కార్డ్స్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతి రావు మాట్లాడుతూ నరేంద్ర మోదీ ప్రధానమంత్రి అయిన నాటి నుంచి అనేక సంక్షేమ పథకాలను ప్రజలలోకి తీసుకొచ్చారని చెప్పారు. ముఖ్యంగా 70 సంవత్సరాల దాటిన అందరికీ కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ కార్డ్స్ ఇస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు నేరెళ్ల మాధవ రావు, సాధు రామకృష్ణ, లక్ష్మీ కుమారి,సాయి, కార్యక్రమ కన్వీనర్ చరక కుమార్ గౌడ్, కో–కన్వీనర్ దేసు సత్యనారాయణ పాల్గొన్నారు.